క్లుప్తంగా

సమయపాలన పాటించాలి


పుత్సలవీధి అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లను పరిశీలిస్తున్న కేసలి

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. పట్టణంలోని లంకా పట్నం, పుత్సలవీధి, కోవెలగట్టు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాలలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని పూర్తిస్థాయిలో అందించాలని సూచించారు.

చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే


చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: మండలంలోని నందిగాంలో సుమారు రూ. 2.40 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మించిన అమృత్ సరోవర్ చెరువును ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మంగళవారం పరిశీలించారు. అనంతరం గ్రామంలోని జరుగుతున్న బంగారమ్మ, పొదాలమ్మ, దుర్గాలమ్మ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ గరే మురళీమోహనరావు, సచివాలయ కన్వీనర్లు సుందర హరీష్, పోతిరెడ్డి గోపి, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, ఏపీఓ అదిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కథల పుస్తకాల వితరణ


లైబ్రేరియన్ మహేష్‌కు కథల పుస్తకాలను వితరణగా అందిస్తున్న ఉపాధ్యాయుడు రొంగలి శేఖర్

డెంకాడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయానికి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రొంగలి శేఖర్ కథల పుస్తకాలను మంగళవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మహేష్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుడు 24 కథల పుస్తకాలు అందజేశారన్నారు.

అప్రమత్తంగా ఉండాలి...


మాట్లాడుతున్న హోమియో వైద్యాధికారి లక్ష్మీశైలజ

పూసపాటిరేగ: వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హోమియో వైద్యాధికారి కేవై లక్ష్మీశైలజ తెలిపారు. మంగళవారం స్థానిక హోమియోవైద్యశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. చెమటపట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, నోరు ఎండిపోవడం, చర్మం పొడిబారడం మొదలగు లక్షణాలు ఉన్నప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. వడదెబ్బ తగలకుండా తేలికగా పలుచగా ఉండే నూలు వస్త్రాలు, చెమట పీల్చే కాటన్ వస్త్రాలు ధరించాలని సూచించారు. మజ్జిగ, లస్సీ, కొబ్బరి నీళ్లు, బార్లీ నీళ్లు, చెరుకు, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది ఆర్‌వీ రమణ, తదితరులున్నారు.

భూముల రీ సర్వేతో ప్రయోజనం


రీసర్వేను ప్రారంభిస్తున్న అంబళ్ల శ్రీరాములనాయుడు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: సమగ్ర భూముల రీసర్వేతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు అన్నారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో భూముల రీసర్వే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా ఏళ్ల నాటి భూసమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, సర్వే సిబ్బంది కచ్చితమైన సర్వే చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దురగాశి ఎర్రంనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల్లో 'జగనన్నకు చెబుదాం'


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

- నగర పంచాయతీ కమిషనర్ బాలాజీ ప్రసాద్

నెల్లిమర్ల: నగర పంచాయతీలోని అన్ని వార్డు సచివాలయాల్లోనూ 'జగనన్నకు చెబుదాం(స్పందన)' కార్యక్రమాన్ని ప్రతిరోజూ తప్పనిసరిగా నిర్వహించాలని కమిషనర్ పి. బాలాజీప్రసాద్ ఆదేశించారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా స్వీకరించిన ఫిర్యాదులను అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా సకాలంలో పరిష్కరించాలని సూచించారు. సదరు అర్జీలు న్యాయస్థానం పరిధిలో ఉన్నా, ఆర్థిక పరమైన, ప్రభుత్వ విధానపరమైనవి అయితే అర్జీదారుడికి ఆ విషయాలను వివరించాలన్నారు. అర్జీని ఫోటోతో సహా ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు.

పాఠశాలల్లో చేర్పించాలి

నగరపంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో బడిబయట ఉన్న పిల్లలను వెంటనే పాఠశాలల్లో చేరిపించాలని ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు కార్యదర్శులకు ఆదేశించారు. వార్డు వలంటీర్ల ద్వారా సర్వే చేయించి, పిల్లలను గుర్తించాలని సూచించారు. అలాగే పదో తరగతి పరీక్షలు తప్పిన విద్యార్థులంతా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు–నేడు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఎంఈఓ సూచించారు. సమావేశంలో నగరపంచాయతీ మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


పూర్తి చేసిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో అభివృద్ధే అభిమతంగా ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగా నగరంలోని కామాక్షినగర్, కాళిఘట్ కాలనీల్లో రూ. 22 లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం ప్రారంభించారు. కామాక్షి నగర్‌లో ముత్యాలమ్మ ఆలయ పరిసరాలలో అభివృద్ధి పనులతో పాటు కాళిఘాట్ కాలనీలో రహదారులను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, గతంలో అభివృద్ధికి నోచుకోని అనేక ప్రాంతాలు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నాయకత్వంలో అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నాయన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నగరంలో అనేక సమస్యలు తిష్ట వేశాయని ఆరోపించారు. అటువంటి పరిస్థితుల నుంచి అభి వృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దడం వెనుక కోలగట్ల కృషి అభినందనీయమన్నారు. కార్పొరేటర్ పిన్నింటి కళావతి మాట్లాడుతూ, కణపాక వాసుల కోరిక మేరకు ముత్యాలమ్మ ఆలయ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టడం హర్షణీయమన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా పార్కును ఏర్పాటు చేసిన ఘనత కోలగట్ల వీరభద్రస్వామికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, పార్టీ నాయకులు పిన్నింటి సూర్యనారాయణ, సైలాడ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ సమీపంలో నున్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 18 వరకు గడువు ఉందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేబీబీ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 – 23 సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేఉకోవాలన్నారు. ఎంపీసీలో 60, బైపీసీ, సీఈసీలో 40 సీట్లు చొప్పున మొత్తం 140 సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అర్హులైన విద్యార్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన

లక్కవరపుకోట: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ ఎంపవర్‌మెంట్ వ్యవస్థాపకులు బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే ఇంగ్లిష్ పదాలు, గ్రామర్ నేర్చుకుంటే ఉన్నత చదువులు చదివేటప్పుడు అది బాగా ఉపయోగపడుతుందన్నారు. ఇంగ్లిష్ మాట్లాడడం వచ్చిన ఎంతోమందికి ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ దామోదర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో ప్రయాణాలు తగ్గించుకోవాలి

దత్తిరాజేరు: ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో దూరపు ప్రయాణాలు వీలైనంత వరకు తగ్గించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సతీష్ సూచించారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన వేసవిలో వడదెబ్బ తగిలే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించి, వడదెబ్బకు గురికాకుండా ఉండాలని తెలిపారు. అత్యవసరమైనప్పుడే బయటకు వెళ్లాలని, వెళ్లేటప్పుడు వాటర్ బాటిల్, గొడుగు వెంట తీసుకువెళ్లాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇంట్లోనే ఉండి, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు



మాట్లాడుతున్న సర్పంచ్ కోరాడ రమణి

డెంకాడ: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించారని జొన్నాడ సర్పంచ్ కోరాడ రమణి, ఎంపీటీసీ సభ్యురాలు త్రిపురగిరి దేవి అన్నారు. జొన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రవేశాల కోసం హెచ్ఎం, ఉపాధ్యాయులు గ్రామ సచివాలయంలో గ్రామస్తులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంతో పాటు విద్యకు అవసరమైన అన్ని వస్తువులను ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కోరాడ కోటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఓ పక్క ఎండ.. మరోపక్క వర్షం


విజ్జీ స్టేడియం వద్ద మంచు ముసుగులో మచ్చకొండ

- పట్టణంలో వింతైన వాతావరణం

విజయనగరం రూరల్: పట్టణంలో మంగళవారం వాతావరణంలో వింతైన మార్పులు కనిపించాయి. ఉదయం 7.30 గంటల వరకు శీతాకాలాన్ని తలపించేలా పరిసర ప్రాంతాలు కనిపించనంతగా పొగమంచు కమ్మేసింది. అనంతరం మధ్యాహ్నం 2.15 గంటల వరకు 40 డిగ్రీల పైబడి ఎండ కాచింది. దీంతో పట్టణవాసులు ఎండవేడిమితో పాటు ఉక్కబోతతో అల్లాడిపోయారు. వెనువెంటనే వాతావరణం ఒక్కసారిగా చల్లబడి పెద్ద గాలులతో అరగంట పాటు వర్షం కురిసింది. ఒకే రోజున మూడు కాలాలను సూచించేలా వాతావరణంలో పలు మార్పులు చోటుచేసుకోవడంతో పట్టణవాసులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

వ్యర్థాల తొలగింపు

కార్పొరేషన్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం పెద్ద గాలులతో కూడిన వర్షం కురవడంతో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు పడిపోయాయి. అలాగే వర్షం నీరు రోడ్లపై నిలిచిపోయింది. దీంతో మున్సిపల్ ప్రజారోగ్య అధికారి డాక్టర్ కేవీఎస్ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాల్మన్‌రాజు, రామరాజు, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టారు.


వర్షపు నీటి తొలగింపు చర్యలు పర్యవేక్షిస్తున్న మున్సిపల్ అధికారులు

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి


వసంత్‌విహార్‌లో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

- మరింత మెరుగైన పాలన అందిస్తాం
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నాలుగేళ్లుగా రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. 2024లో కూడా జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే మరింత మెరుగైన పాలన అందుతుందని చెప్పారు. నగరంలోని 30వ డివిజన్ పరిధి నోబుల్‌నగర్, వసంత విహార్ ప్రాంతాలలో మంగళవారం ఉదయం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కోలగట్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల వ్యవధిలో సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఇంటింటికీ వెళ్తుంటే లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం పనితీరుపై సానుకూలత వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. దళారుల బెడద లేకుండా అమ్మ ఒడి, ఆసరా, చేయూత, రైతుభరోసా వంటి అనేక పథకాలు లబ్ధిదారులకే నేరుగా అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామిని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంతకుముందు వసంత్‌విహార్ వాసులు ఎమ్మెల్యే, తదితరులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌చార్జ్ మారెం బాలబ్రహ్మారెడ్డి, టీపీఆర్ఓ సింహాచలం, సచివాలయ సిబ్బంది, డివిజన్ ఇన్‌చార్జ్ పూసర్ల శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు చందక ఆదిలక్ష్మి, యువజన అధ్యక్షుడు సువ్వాడ జయరామ్, తదితరులు పాల్గొన్నారు.

జైనుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం


డిప్యూటీ స్పీకర్ కోలగట్లను సత్కరిస్తున్న జైనులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: వివిధ వ్యాపార, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన జైనులు తమ కుటుంబ సభ్యులేనని... వారి సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందిస్తానని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. వారికి ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానని చెప్పారు. మంగళవారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో శ్రీ జైన్ శ్వేతాంబర్ సంఘ్ ఆధ్వర్యంలో మైనారిటీ అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరంలో స్థిరపడిన జైనులకు గ్రామ, వార్డు సచివాలయ శాఖ ద్వారా మంజూరైన కమ్యూనిటీ, నేటివిటీ ధ్రువపత్రాలను రెవెన్యూ అధికారులతో కలిసి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం 84 మందికి సర్టిఫికెట్లు అందజేశామని, ఇంకా ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇటీవల భేటీ బచావో కోసం మహిళా మండల్ వారు స్థూపం నిర్మాణం కోసం ముందుకు వస్తే తగిన స్థలం చూపించి సహకారం అందించామని గుర్తు చేశారు. అనంతరం వారంతా కోలగట్లను దుశ్శాలువ, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జైన్ సంఘ్ ప్రతినిధులు మనోజ్ కుమార్ జైన్, శాంతిలాల్, బన్వత్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు


క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు, తదితరులు

విజయనగరం టౌన్: సత్య డిగ్రీ కళాశాలలో కోచింగ్ తీసుకుంటున్న కిక్ బాక్సింగ్ విద్యార్థులు పతకాలు సాధించారని కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు అన్నారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో క్రీడాకారులను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కిక్ బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ఇటీవల జరిగిన 31వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్, నేషనల్ టీమ్ సెలక్షన్‌లో బంగారు, రజత, కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారన్నారు. బంగారు పతకాలు పొందినవారిలో దీపక్ కుమార్, వంశీవరుణ్.. రజత పతకం పొందిన వారిలో చంద్రమౌళి, దుర్గాప్రసాద్.. కాంస్య పతకం పొందినవారిలో దుర్గా, రవి ఉన్నారన్నారు. క్రీడాకారులు కిక్ బాక్సింగ్‌లో మరింతగా రాణించి, అనేక పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీ సదస్సును జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆదివాసీ, ప్రజాసంఘాల నేతలు

శృంగవరపుకోట: అఖిల భారత ఆదివాసీ సదస్సుకు సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే ఈ సదస్సును జయప్రదం చేయాలని స్థానిక ఆదివాసీ, ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ సర్కారు ఆదివాసీల హక్కులను కాలరాసేలా పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. బీజేపీ హయాంలో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయంపై దేశ వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భారీ సంఖ్యలో సదస్సుకు తరలివచ్చి, ఆదివాసీల ఐక్యతను చాటాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ, ప్రజాసంఘాల నేతలు యు.మల్లేష్ పార్వతి, కె.దేముడమ్మ, ఎస్.వెంకటలక్ష్మి, సీహెచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను దూరం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు. జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా మంగళవారం వాడవాడలా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఖాళీ టైర్లు, కొబ్బరి బొండాల్లో దోమలు వృద్ధి చెందుతాయని, అటువంటి వస్తువులు ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలని సూచించారు.

– విజయనగరం నెట్‌వర్క్


విజయనగరం : నగరంలో డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేషన్ వైద్య సిబ్బంది


విజయనగరం ఫోర్ట్: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు


విజయనగరం రూరల్: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


పూసపాటిరేగ: డెంగీపై అవగాహన ర్యాలీ చేస్తున్న హెల్త్ సిబ్బంది